

మాతృత్వం.. ఇదేం నిర్లక్ష్యం

'మాతృత్వాన్ని గౌరవిద్దాం' పేరుతో ప్రభుత్వాస్పత్రుల్లో స్టాఫ్‌నర్సులతో చేపట్టిన 'మిడ్ వైఫరీ' కార్యక్రమం సక్రమంగా సాగడం లేదు. వివరాలు 10లో ▸



కోలుకున్న సంజీవన్‌రావుపేట్

జీవన్‌రావుపేటలో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కలుషిత నీటితో అస్వస్థతకు గురైన బాధితులు క్రమంగా కోలుకుంటున్నారు. వివరాలు 10లో ▸



మెలకువలతో మంచి దిగుబడులు

ఆలుగడ్డ సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సరిత, రాహుల్ విశ్వకర్మలు రైతులకు సూచించారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ఆర్టీసీకి రూ.31.92 లక్షల ఆదాయం

జహీరాబాద్ టౌన్: దసరా స్పెషల్ ఆపరేషన్ ద్వారా ఒక్కరోజే ఆర్టీసీకి రూ.31.92 లక్షల రికార్డు ఆదాయం వచ్చిందని జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. దసరా పండుగ సందర్భంగా సొంతూర్లకు వెళ్లిన ప్రయాణికులు తిరుగు ప్రయాణం దృష్టిలో పెట్టుకుని సోమవారం బీదర్–హైదరాబాద్ రూట్‌లో రెగ్యులర్‌తో పాటు ప్రత్యేక బస్సులను నడిపామని చెప్పారు. ఒక్కరోజే 43,752 మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేశామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సహకారం వల్ల ఇది సాధ్యమైందని చెప్పారు.

నేడు నారాయణఖేడ్‌లో దామోదర పర్యటన

నారాయణఖేడ్: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం నారాయణఖేడ్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. నిజాంపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామంలో రూ.125కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అనంతరం వాసర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొననున్నట్లు వివరించారు.

రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో నిరసన



రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో మంగళవారం జహీరాబాద్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ఆచార్య, వశిష్ట, జాగృతి కళాశాలల యాజమాన్యం, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య, వశిష్ట డిగ్రీ కళాశాలల చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి మాట్లాడుతూ మూడేళ్ల నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అధ్యాపకులకు జీతభత్యాలు ఇవ్వలేకపోతున్నామని, ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్, డైరెక్టర్లు అమర్‌నాథ్, 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లొద్ద కులస్తులను బీసీ–బీలో చేర్చాలి

కల్హేర్(నారాయణఖేడ్): లొద్ద కులస్తులను బీసీ–బీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీ–డీలో ఉన్న లొద్ద కులస్తులను బీసీ కులగణనలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

'ఉపాధి'కి ప్రణాళికలు సిద్ధం చేయాలి

అడిషనల్ డీఆర్‌డీఓ బాల్‌రాజ్

జహీరాబాద్ టౌన్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ బాల్‌రాజ్ ఆదేశించారు. నియోజకవర్గం స్థాయి ఉపాధి సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామస్థాయిలో ఆర్థిక సంవత్సరంలో ఏఏ పనులు చేపట్టాలో గుర్తించి ఆమోదించాలని చెప్పారు. పూర్తి చేసిన ప్రణాళికలను మండల పరిషత్ కార్యాలయానికి పంపాలన్నారు. ఈజీఎస్ ద్వారా కేటాయించిన నిధులన్నీ వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో జహీరాబాద్ ఏపీఓ అశోక్‌కుమార్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి, రాయికోడ్ మండలాల ఏపీఓ, జీఈ, టీఏలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మత్స్య శాఖ రాష్ట్ర చైర్మన్ సాయికుమార్

చిన్నశంకరంపేట(మెదక్): మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయిరామ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆయన్ను నార్సింగి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కదలం.. వదలం!

జిల్లాలోని తహసీల్దార్ పోస్టులకు డిమాండ్

- బదిలీపై వెళ్లిన వారు సైతం సంగారెడ్డికి వచ్చేందుకే మొగ్గు
- ప్రస్తుతం ఉన్న వారిది ఇదే వైఖరి
- కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో తహసీల్దార్ పోస్టులకు భలే డిమాండ్ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల్లో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు తిరిగి సంగారెడ్డి జిల్లాకే వచ్చేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే.. ఇతర జిల్లాల నుంచి సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు కూడా ఇక్కడే ఉండిపోవడానికి మొగ్గు చూపుతుండటం గమనార్హం. దీంతో పోయిన వారు తిరిగి జిల్లాకు రావడం, ఉన్న వారు ఇక్కడే ఉండేందుకు మొగ్గు చూపుతుండంతో జిల్లాలోని తహసీల్దార్ పోస్టులకు పోటాపోటీ నెలకొంది. ఇటీవల తహసీల్దార్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీలు కావాలని కోరుతున్న తహసీల్దార్లు ఆయా జిల్లాల కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. దీంతో తహసీల్దార్లు తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. మూడేళ్లకు పైగా ఒకే జిల్లాలో పని చేసిన అధికారులను ఇతర ప్రాంతాలకు స్థానచలనం కల్పిస్తుంటారు. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో సుమారు 26 మంది తహసీల్దార్లకు బదిలీలు జరిగాయి. ఎక్కువ మంది జిల్లా తహసీల్దార్లు సమీపంలో ఉన్న వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. కొందరు జనగామ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, గద్వాల తదితర జిల్లాలకు కూడా బదిలీ అయింది. వీరిలో సుమారు 16 మంది తహసీల్దార్లు సంగారెడ్డి జిల్లాకు వస్తామని దరఖాస్తులు చేసుకున్నట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

హెచ్‌ఎండీఏ పరిధిలో..

జిల్లాలో హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న మండలాలకు ఎక్కువ పోటీ ఉంటుంది. ప్రధానంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం, జిన్నారం, కంది, సంగారెడ్డి, హత్నూర, గుమ్మడిదల తదితర మండలాలతో పాటు, కొండాపూర్, సదాశివపేట మండలాల తహసీల్దార్ల పోస్టులకు డిమాండ్ ఉంటుంది. ఈ మండలాల్లో కొన్ని సంవత్సరాలు పని చేస్తే చాలు కోటీశ్వరులు కావొచ్చనే చర్చ సంబంధిత వర్గాల్లో ఉంది. ఈ మండలాల్లో పనిచేసి రూ.వేల కోట్లు విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేసేందుకు పరోక్షంగా సహకరించిన కొందరు తహసీల్దార్లు భారీగా అక్రమాస్తులు కూడగట్టుకున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. బినామీ పేర్లతో విల్లాలు, ఫామ్‌హౌజ్‌లు సంపాదించుకున్నారు. భారీగా అక్రమాస్తులను కూడగట్టుకున్నారు. దీంతో ఈ పోస్టుల కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేస్తుంటారు. ఇటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని ఈ పోస్టులను దక్కించుకోవడం పరిపాటిగా తయారైంది. కాగా స్థానిక సంస్థల ఎన్నికలయ్యే వరకు తహసీల్దార్లను బదిలీలు ఉండవని ప్రభుత్వం తేల్చి చెప్పినప్పటికీ.. ఆయా ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది.



ఇక్కడే ఉంటాం!

ఇతర జిల్లాల నుంచి ఎన్నికల బదిలీలపై వచ్చిన తహసీల్దార్లు ఇక్కడే ఉండేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడికి వచ్చిన తహసీల్దార్లలో కనీసం ఐదారుగురు కూడా ఇతర జిల్లాలకు వెళతామని దరఖాస్తులు చేసుకోలేదు. ఇది పెద్ద చర్చనీయాంశమైంది.

సొంత జిల్లా పోస్టింగ్‌పై స్పష్టత కరువు

సొంత జిల్లాలో పోస్టింగ్‌లు ఇచ్చేది లేదని ప్రభుత్వం ముందుగా సర్క్యులర్ జారీ చేసింది. దీంతో జిల్లాకు వచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్న తహసీల్దార్లకు నిరాశే ఎదురైంది. సొంత జిల్లా మినహాయింపు ఇవ్వాలని తిరిగిన విజ్ఞప్తులు వెళ్లాయి. దీనిపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

అగ్రనేతల వద్ద అసమ్మతి గళం



గాంధీభవన్‌లో జరిగిన సమీక్షలో ఉమ్మడి మెదక్ జిల్లా ముఖ్యనేతలు

గాంధీభవన్‌లో గజ్వేల్ పంచాయితీ!

- జహీరాబాద్ విభేదాలు సైతం ప్రస్తావన
- గైర్హాజరైన ఎమ్మెల్యే గూడెం, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అసమ్మతి సెగలు మరోసారి భగ్గుమన్నాయి. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షలో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన అసమ్మతి నేతలు తమ గళం విప్పారు. ఈ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల విషయంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పలువురు సీనియర్ నాయకులు అధినాయకత్వం దృష్టికి తేవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ సమీక్ష జరిగింది. అగ్రనేతలు దీపాదాస్‌మున్షీ, విశ్వనాథన్, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ తదితర ముఖ్యనేతలు పాల్గొన్న ఈ సమీక్షలో గజ్వేల్ పంచాయితీ ప్రస్తావనకు రావడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

జహీరాబాద్‌పైనా చర్చ

ఈ సమావేశంలో జహీరాబాద్ నియోజకవర్గం పైనా చర్చ జరిగింది. నియోజకవర్గంలో కొన్ని అంశాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సెట్విన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీన్ని జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించి పరిష్కరించుకుంటున్నామని పేర్కొన్నారు.

కేసీఆర్, హరీశ్ వంటి నేతలున్న జిల్లాలో..

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వంటి అగ్రనేతలున్న జిల్లాలో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయకపోతే కష్టమని దీపాదాస్ మున్షీ పార్టీ శ్రేణులకు సుతిమెత్తగా హెచ్చరించినట్లు తెలిసింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడి పనిచేయకపోతే పార్టీ అభ్యర్థుల గెలుపు కష్టమని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు డాక్టర్ సంజీవరెడ్డి, మైనంపల్లి రోహిత్‌రావు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన నీలంమధు, గాలి అనిల్‌కుమార్, కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఫయీం, డీసీసీ అధ్యక్షులు నిర్మలారెడ్డి, రెడ్డిపల్లి ఆంజనేయులు, మాజీ మంత్రి చంద్రశేఖర్, పీసీసీ నాయకుడు చేర్యాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా గూడెం

ఈ సమీక్షకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలల క్రితమే మహిపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. అయితే ఈ సమావేశానికి మహిపాల్‌రెడ్డితో పాటు, ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కాటా శ్రీనివాస్‌గౌడ్ సైతం ఈ సమావేశానికి రాలేదు. ఈ సమీక్షకు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జీలు, పీసీసీ కార్యవర్గంలోని నాయకులు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ముఖ్యనేతలను ఆహ్వానించారు. అయితే ఈ సమావేశానికి గూడెం మహిపాల్‌రెడ్డి గైర్హాజరుకావడం గమనార్హం. అలాగే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా హాజరుకాలేదు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్: మాజీ ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును సైతం సునీతారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

పారదర్శకంగా విచారణ జరపాలి

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి: ఎస్పీ

పటాన్‌చెరు టౌన్: ఆయా కేసులలో పారదర్శకంగా విచారణ జరగాలని ఎస్పీ రూపేష్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. విచారణలో ఉన్న కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సున్నితమైన కేసులను విచారించేటప్పుడు నూతన చట్టాల ప్రకారం తగు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. పటాన్‌చెరు సబ్‌డివిజన్‌లో ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, అధిక పరిశ్రమలు ఉండటంతో అధిక ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో నిషేధిత గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ అమ్మకాలు, అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లా సరిహద్దులలో, జాతీయ రహదారులపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ కేసులను ఛేదించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆయన వెంట అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు ఈనెల 17వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐఎఫ్‌ఎల్ పరిశ్రమలో 50 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్లతో డీఆర్డీఓ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. రూ.12వేల నుంచి 18 వేల వరకు వేతనం ఉంటుందని చెప్పారు.

22 శాతం అధిక వర్షపాతం



బోరునుంచి బయటకు ఉబికి వస్తున్న నీరు

- సాధారణ వర్ష పాతం 718.9 మి.మీ.
- కురిసిన వర్షం 880.4 మి.మీ.
- భారీగా పెరిగిన భూగర్భ జలాలు

జహీరాబాద్: జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 22 శాతం మేర అధిక వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. ఫలితంగా వ్యవసాయ బావులు, బోర్లలో నుంచి బయటకు నీరు ఉబికి వస్తోంది. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతరం 718.9 మి.మీ కురవాల్సి ఉండగా, 880.4 మి.మీ మేర వర్షం కురిసింది. దీంతో 22.5 అధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 120 మి.మీ మేర కురవాల్సి ఉండగా.. 139.7 మి.మీ మేర వర్షం కురిసింది. 16.4 శాతం అధికంగా నమోదైంది. జూలైలో 194.2 మి.మీ కురవాల్సి ఉండగా 188.2 మి.మీ మాత్రమే కురిసింది. దీంతో 3.1 శాతం మేర తక్కువ వర్షం కురిసింది. ఆగస్టులో 190.4 మి.మీ సాధారణ వర్షం పడాల్సి ఉండగా 172 మి.మీ వర్షం పడింది. దీంతో 9.6 లోటు వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో భారీగా వర్షాలు పడ్డాయి. సాధారణ వర్షపాతం 156 మి.మీ కాగా ఏకంగా 321.4 మి.మీ వర్షం కురిసింది. దీంతో 106.1 అధిక శాతం వర్షపాతం నమోదైంది. అధికవర్ష పాతం నమోదైన మండలాల జాబితాలో కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి, రాయికోడ్, సిర్గాపూర్, సంగారెడ్డి, జిన్నారం, కంది, పటాన్‌చెరు, అమీన్‌పూర్, రాంచంద్రాపురం మండలాలు చేరాయి. సాధారణ వర్షపాతం కింద కంగ్టి, నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, మనూర్, జహీరాబాద్, మునిపల్లి, వట్‌పల్లి, పుల్‌కల్, సదాశివపేట, హత్నూర, గుమ్మడిదల, నిజాంపేట మండలాలు చేరాయి.

పాఠశాలల కేటాయింపు

కొత్త టీచర్లకు పత్రాలు అందజేత



ఉపాధ్యాయురాలికి పాఠశాల కేటాయింపు పత్రం అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి, తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇటీవల డీఎస్సీ–2024లో నియామకమైన అభ్యర్థులకు మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి పాఠశాలల కేటాయింపు పత్రాలను అందజేశారు. జిల్లాకు 1:1 నిష్పత్తిలో భాగంగా 397 మంది అభ్యర్థులు నియామకమయ్యారు. వీరిలో ఎస్జీటీలు 285, ఎస్ఏలు 91, లాంగ్వేజి పండిట్‌లు 15, పీఈటీలు ఆరుగురు ఉన్నారు. వీరంతా ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ నెల 9వ తేదీన ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియామకపత్రాలను అందుకున్న విషయం విదితమే. దీనిలో భాగంగానే మంగళవారం నూతనంగా నియామకమైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ అనంతరం పాఠశాలల కేటాయింపు పత్రాలను అందజేశారు. వీరంతా బుధవారం తమకు కేటాయించిన పాఠశాలలో జాయిన్ కానున్నారు. కాగా, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుండె నిండా 'బడిగంటలు'

- కొత్త ఉపాధ్యాయుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- కష్టపడ్డాం.. లక్ష్యాన్ని సాధించాం
- 'సాక్షి'తో అభ్యర్థుల మనోగతం

ఎన్నో ఏళ్ల కల.. సంవత్సరాలుగా కృషి.. వెరసి చివరకు వారు ఇష్టంగా ఎంచుకున్న ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కొందరు పట్టుబట్టి విజయం సాధిస్తే.. మరికొందరు ఆర్థిక కష్టాలకు ఎదురీది అనుకున్న లక్ష్యం చేరుకున్నారు.. వారి గుండెల నిండా సంతోషాలతో బడిగంటలు మోగుతున్నాయి. ఉద్యోగం సాధించే క్రమంలో ఒక్కొక్కరిదీ ఒక్కో తీరు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికైన అభ్యర్థులు తమకు కేటాయించిన పాఠశాలలో చేరేందుకు నియామక పత్రాలను అందుకుంటున్న వేళ తమ సంతోషాన్ని, అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. – సంగారెడ్డి ఎడ్యుకేషన్

నిరంతరం శ్రమించా..



చిన్నప్పటి నుంచి కూడా ఆటలంటే ఎంతో ఇష్టం .. పాఠశాల స్థాయిలో వాలీబాల్, ఖోఖో ఎక్కువగా ఆడేవాడిని. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ఝరాసంగంలోని ప్రభుత్వ పాఠశాలలోనే జరిగింది. ఏడాది పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా అవనిగడ్డలో కోచింగ్ తీసుకున్నా. గతంలో డీఎస్సీతో పాటు కానిస్టేబుల్, పంచాయతీ కార్యదర్శి వంటి పోటీ పరీక్షలు రాసినప్పటికీ నిరాశ తప్పలేదు. అయినా ఏ మాత్రం కుంగిపోకుండా నిరంతరం సాధన చేయడం ద్వారా జిల్లాలో ఉన్న ఒకే ఒక పీడీ పోస్టుకు సెలక్ట్ కావడం చాలా సంతోషంగా ఉంది. జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తా.

– బి శ్రీనివాస్, పీడి, ఝరాసంగం

ఆర్థిక పరిస్థితులకు ఎదురొడ్డి..



ఇంటర్మీడియెట్ చదువుతున్న క్రమంలోనే నాన్న మరణించాడు. అమ్మ వ్యవసాయ కూలీ. తినడానికి తిండి కూడా లేని పరిస్థితి. ఇంటర్మీడియట్ పూర్తి చేసినా.. డిగ్రీ చదివించే స్తోమత లేదు. దీంతో మా పెదనాన్న కూతురు (అక్క) సహాయంతో నారాయణఖేడ్‌లో వాళ్ల ఇంట్లో ఉంటూ డిగ్రీ పూర్తి చేశాను. సెలవు రోజుల్లో ఏదో పని చేసి డబ్బులు సంపాదించి చదువుకునేవాడిని. ఓయూలో బీఈడీ పూర్తి చేసిన అనంతరం సీఆర్పీగా 12 ఏళ్లు విద్యాశాఖలో పని చేశాను. సీఆర్పీగా పని చేస్తూనే మూడు సార్లు డీఎస్సీ రాశాను. అయినా వెనకడుగు వేయలేదు. ఇటీవలే గురుకులంలో ఉద్యోగం సాధించినప్పటికీ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావాలనే కల కోసం శ్రమిస్తూనే చివరకు సీనియర్ అసిస్టెంట్ కోటలో బయోలాజికల్‌లో ఉద్యోగం సాధించాను.

– జనార్దన్, మాందాపూర్ రాయికోడ్ మండలం

రైల్వే ఉద్యోగాన్ని వదిలి..



అమ్మ, నాన్న వ్యవసాయ కూలీలు. చిన్నప్పటి నుంచి ప్రాథమిక విద్యాభ్యాసం, ఉన్నత విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలోనే. అమ్మనాన్న కష్టపడి బీఈడీ చదివించారు. ఏడాది పాటు కృష్ణా జిల్లాలోని అవనిగడ్డలో కోచింగ్ తీసుకున్నా. 2017లో డీఎస్సీ రాసినప్పటికీ సెలక్ట్ కాలేదు. రైల్వేలో గ్రూపు డి. ఉద్యోగం సాధించాను. అయిప్పటికీ ఉపాధ్యాయుడి కోరిక కావాలనే కోరికతో నిరంతరం శ్రమించా.. చివరకు ఎస్‌జీటీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దుతా.

– గాలుగొంద, దూదిగొంద, మనూరు మండలం

నాన్నే స్ఫూర్తి



హోతి (బి) గ్రామం మాది. మా నాన్న ఈదులపల్లిలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు. నాన్నను స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివాను. అదృష్టం కొద్దీ మొదటి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించడం చాలా ఆనందంగా ఉంది. గతంలో మాదిరిగా కాకుండా మారిన కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులు ఉపయోగించి విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు సమాజం గర్వించ దగ్గ వ్యక్తులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా బోధన చేస్తా.

– స్రవంతి, హోతి (బి)

క్లుప్తంగా

జాతీయ స్థాయి ట్రెక్కింగ్‌లో విద్యార్థి మణికంఠ



మణికంఠను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయిలో జరిగిన ట్రెక్కింగ్ క్యాంప్‌లో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్ మేరీస్ విద్యానికేతన్ ఎన్‌సీసీ విద్యార్థి దూలం మణికంఠ పాల్గొన్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కాట రాయప్ప పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని మంగళవారం అభినందించారు. అనంతరం రాయప్ప మాట్లాడుతూ 6 నుంచి 13 వరకు ఏపీలోని చిత్తూరులో 35వ బెటాలియన్ ఆధ్వర్యంలో జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. క్యాంపునకు దేశవ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు ఎంపిక కాగా ఇందులో సిద్దిపేట జిల్లా నుంచి మణికంఠ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం..

దరఖాస్తు గడువు ఐదురోజులు పొడిగింపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు గడువును మరో ఐదు రోజులు పొడిగించినట్లు టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దాలుగా జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా తమ సంఘం పనిచేస్తుందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు అందలేదని, వారి కోసం రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైజల్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు. 15తో దరఖాస్తు గడువు ముగుస్తుండగా, మరో ఐదు రోజులు పొడిగించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్‌తో పాటు, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిఖీ, రాష్ట్ర హౌసింగ్ కమిటీ సభ్యుడు అన్వర్‌కు అందించాలని తెలిపారు. నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేట ప్రాంతాల ప్రెస్ క్లబ్ బాధ్యులకు, ఆయా ప్రాంతాల రాష్ట్ర, జిల్లా నాయకులకు దరఖాస్తులను అందజేయాల్సిందిగా యాదగిరి కోరారు.

21న అవంచకు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు



ఫాంపాండ్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

నర్సాపూర్ రూరల్: క్షేత్రస్థాయి పర్యటన కోసం 21న నర్సాపూర్ మండలం అవంచ గ్రామానికి ట్రైనీ ఐఏఎస్‌ల బృందం రానుందని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈక్రమంలో మంగళవారం అవంచ గ్రామాన్ని సందర్శించి అధికారులకు సలహాలు సూచనలు చేశారు. అలాగే, మురికి కాల్వలు, అంతర్గత రోడ్ల పరిశుభ్రత, ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న ఫాంపాండ్, మొక్కల పెంపకం ఇతర పనులను పరిశీలించారు. బృందం సభ్యులు గ్రామస్థాయిలో జరిగే అన్ని శాఖల పనులు, అభివృద్ధిపై అవగాహన పొందేందుకు రానున్నట్లు తెలిపారు. అధికారులు వారికి అందుబాటులో ఉండి కావాల్సిన వివరాలను తెలియజేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం భవనంలో బస చేస్తారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎంపీఓ వైద్య శ్రీనివాస్, కార్యదర్శి మల్లేశ్ కు సూచించారు.

మాతృత్వం.. ఇదేం నిర్లక్ష్యం

నిలిచిన 'మిడ్ వైఫరీ' సేవలు

- గర్భిణులకు సాధారణ ప్రసవమే లక్ష్యం
- తొలి రోజుల్లో మంచి ఫలితాలు
- సిబ్బంది లేక కొనసాగని వైనం
- ప్రోత్సాహకం అందించడం లేదని పని చేయడానికి విముఖత
- గజ్వేల్‌తోపాటు రాష్ట్రంలోని మరో ఐదు ప్రభుత్వాస్పత్రుల్లో అమలు



కడుపు కోతలను నివారించి, సాధారణ ప్రసవాలను పెంచడమే లక్ష్యంగా 'మాతృత్వాన్ని గౌరవిద్దాం' పేరుతో ప్రభుత్వాస్పత్రుల్లో స్టాఫ్‌నర్సులతో చేపట్టిన 'మిడ్ వైఫరీ' కార్యక్రమం సక్రమంగా సాగడం లేదు. గజ్వేల్‌తోపాటు రాష్ట్రంలోని మరో ఐదు ప్రభుత్వాస్పత్రులను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి ఈ పథకం అమలు చేశారు. తొలి రోజుల్లో మంచి ఫలితాలనిచ్చి.. ఎంతో మంది గర్భిణులకు భరోసానిచ్చింది. కానీ, నేడు సిబ్బంది లేకపోవడంతో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

– గజ్వేల్

అభివృద్ధి చెందిన దేశాల్లో అమల్లో ఉన్న 'మిడ్ వైఫరీ' విధానం ఇక్కడ కూడా తీసుకురావడానికి 2017లో అంకురార్పణ జరిగింది. ఫెర్నాండేజ్ ఫౌండేషన్, యూనిసెఫ్ సహకారంతో ప్రభుత్వం అమలు చేస్తోంది. 2021 నుంచి ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి అప్పటి ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రంలోని గజ్వేల్‌తోపాటు భద్రాచలం, మంచిర్యాల, వనస్థలిపురం, సిరిసిల్ల, సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రులను ఇందుకోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి పథకాన్ని అమలు చేశారు. గజ్వేల్‌లో 12 మంది, భద్రాచలంలో 16, మంచిర్యాలలో 20 మంది, సిరిసిల్లలో 13 మంది, వనస్థలిపురంలో 19, సంగారెడ్డిలో 24 మంది స్టాఫ్ నర్సులను ఎంపిక చేసి నిష్ణాతులైన ట్రైనర్లతో మిడ్ వైఫరీపై శిక్షణ చేపట్టారు.

పీహెచ్‌సీల్లో గర్భిణులకు వ్యాయామాలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న స్టాఫ్ నర్సులు (ఫైల్)

శిక్షణ పూర్తి చేసుకున్న స్టాఫ్ నర్సులను గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించడానికి పంపారు. వారితో గర్భిణులకు గర్భం నిర్ధారణ అయిన రోజు నుంచి ప్రసవం వరకు తొమ్మిది నెలలపాటు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రత్యేకించి గర్భం దాల్చిన తర్వాత శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తీవ్రంగా వస్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పీహెచ్‌సీల్లో ప్రత్యేక కేటాయించిన గదిలో వ్యాయామాలు చేయించారు. అంతేకాకుండా గర్భిణులు రోజువారీగా తీసుకోవాల్సిన ఆహారం, పోషకాలపై కేలండర్ అమలు చేశారు. ఎనీమియాతోపాటు ఇతర సమస్యలు దరి చేరకుండా ఆహార అలవాట్లలో మార్పులు చేయించారు.

ఆపరేషన్ థియేటర్‌లోకి అనుమతి..

గర్భిణులు సాధారణ కాన్పు అయితే నొప్పుల బాధను భరించలేం అనే భావనతో ఉంటారు. ఈ భావనను తొలగించి నార్మల్ డెలివరీలకు మానసికంగా సిద్ధం చేశారు. ఇందులో మరో ప్రధాన అంశమేమిటంటే డెలివరీ సమయాల్లో ఆపరేషన్ థియేటర్‌లోకి భర్తను , కుటుంబీకులను అనుమతించరు. ఇలాంటి సందర్భాల్లో కాన్పు సరైన విధంగా కాకపోయినా, ఆపరేషన్ విఫలమైనా వైద్యులపై అనుమానాలు వ్యక్తమవుతుంటాయి. కానీ మిడ్ వైఫరీ విధానంలో వాటికి చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. సాధారణ కాన్పు చేసే సమయంలో లోపలికి భర్తను గానీ, ఇతర దగ్గరి బంధువు ఒక్కరిని లోపలికి అనుమతించి వారి సమక్షంలోనే కాన్పులు చేయించారు. అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాతే డెలివరీకి సిద్ధం చేశారు. దీనివల్ల అనుమానాలకు అవకాశం ఉండదు. ఆదిలో ఈ పథకం సత్ఫలితాలనిచ్చినా ప్రస్తుతం నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

'మిడ్ వైఫరీ' వైఫల్యానికి కారణం

మిడ్ వైఫరీ సేవలు సక్రమంగా అందకపోవడానికి ఎన్నో కారణాలు బయటకొస్తున్నాయి. ఈ శిక్షణ పొందిన స్టాఫ్ నర్సులకు ప్రత్యేక కేడర్ ఇచ్చి, ఇతర ప్రోత్సాహకాలు అందించడం లేదు. దీంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడానికి ఇష్టం లేక తమ స్వస్థలాల్లోని ఆస్పత్రులకు బదిలీ చేయించుకొని వెళ్లిపోతున్నారు. గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో గతంలో పని చేసిన సిబ్బంది బదిలీ కావడంతో సేవలు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని మిగితా ఆస్పత్రుల్లోనూ ఇదేరకమైన దుస్థితి నెలకొంది.

సిబ్బంది లేకనే..

'మాతృత్వాన్ని గౌరవిద్దాం' పేరిట చేపట్టిన కార్యక్రమంతో మంచి ఫలితాలు వచ్చాయి. సిబ్బంది లేక ప్రస్తుతం మిడ్ వైఫరీ సేవలు సక్రమంగా అందించలేకపోతున్నాం. త్వరలోనే సిబ్బంది వచ్చే అవకాశముంది. వారు రాగానే సేవలు పునరుద్ధరిస్తాం. గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తాం.

– సాయికిరణ్, గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట భారీ మోసం

రూ.21.35 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ఓ ప్రైవేట్ ఉద్యోగికి బురిడీ కొట్టి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసు కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగికి మార్చి 27వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ రాగా ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడుతూ వచ్చాడు. ముందుగా రూ.లక్ష ఇన్వెస్ట్ చేయగా రూ.2 లక్షలు లాభాలు చూపించారు. బాధితుడు పలు దఫాలుగా రూ.21.35 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదుతో పాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పర్సనల్ లోన్ ఇప్పిస్తామంటూ..

మరో ఘటనలో.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని బృందావన్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి సెప్టెంబర్ 17వ తేదీన రూ. 7 లక్షల పర్సనల్ లోన్ ఇప్పిస్తామంటూ ఫోన్ కాల్ వచ్చింది. బాధితుడు అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా డాక్యుమెంటేషన్, జీఎస్టీ, ఈఎంఐలకు రూ.74 వేలు నగదు వేశాడు. అనంతరం అపరిచిత వ్యక్తి స్పందించకపోవడంతో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కమీషన్ పేరుతో రూ.8.39 లక్షలు

పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి అక్టోబర్ 9వ తేదీన నగదు ఇన్వెస్ట్ చేసి, ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని నమ్మించారు. బాధితురాలు అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు ఇన్వెస్ట్ చేస్తూ టాస్కులు పూర్తి చేసింది. మొత్తం రూ.8.39 లక్షలు ఇన్వెస్ట్ చేసి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ

యువకుడు మృతి

హవేళిఘణాపూర్ (మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాపన్నపేట మండలం యూసూఫ్‌పేటకు చెందిన అనిల్ (35), బాల్‌రాజును మెదక్ నుంచి బైక్‌పై తమ స్వగ్రామం వెళ్తున్నారు. మెదక్ మండలం మంబోజిపల్లివద్దకు రాగానే బైక్ ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ బాల్‌రాజును చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హవేళిఘణాపూర్ (మెదక్): దెబ్బతిన్న ట్రాక్టర్, బైక్

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి..



మల్లేశం (ఫైల్)

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు.. కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన దయ్యాల మల్లేశం (40) సోమవారం రాత్రి సామగ్రి కొనడానికి రాజీవ్ రహదారి పక్కనున్న దుకాణానికి బైక్‌పై వెళ్తూ అవతలి వైపునకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా విషయం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆర్వీం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు జగిత్యాల జిల్లా మద్దులపల్లి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ తోటేటి రాకేష్ కుమార్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

చేగుంట(తూప్రాన్): అంత్యక్రియలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి బోనాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం పోసాన్‌పల్లి గ్రామానికి చెందిన అబ్రమైన నాగులు(56) సమీప బంధువు మృతి చెందగా అన్న కుమారుడు మల్లేశంతో శివాయిపల్లి గ్రామానికి వెళ్లారు. అంత్యక్రియల అనంతరం తిరుగు ప్రయాణంలో రాత్రి బైక్‌పై వస్తుండగా బోనాల్ గ్రామ శివారులో గేదెను ఢీకొట్టారు. బైక్‌పై వెనుకాల కూర్చున్న నాగులు కిందపడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగులు భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



నాగులు(ఫైల్)

రహదారిపై కిందపడి..



సాయిలు మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): జాతీయ రహదారిపై కిందపడి తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కౌడిపల్లి మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. నర్సాపూర్‌కు చెందిన సంకు సాయిలు(65) నర్సాపూర్‌లో భిక్షాటన చేస్తుంటాడు. మంగళవారం రాత్రి నర్సాపూర్ నుంచి వెంకట్రావ్‌పేట వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. తునికిగేట్ గురుకుల పాఠశాల సమీపంలోకి రాగానే కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

టేక్మాల్(మెదక్): ఆలయంలో చోరీ జరిగిన ఘటన టేక్మాల్ మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. కాద్లూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయంలో నిత్యం మాదిరిగానే సోమవారం రాత్రి లైట్ల వెలుతురులోనే తాళం వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని దుండగులు దేవాలయం గ్రీల్‌కు ఉన్న తాళాన్ని రాయితో పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఆలయం లోపలికి వెళ్లి చూడగా హుండీ తాళం పగులగొట్టి నగదు అపహరించారు. హుండీని దేవాలయం ఎదుట చెట్ల పొదల్లో పడేశారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి ఏఎస్ఐ దయానంద్ చేరుకొని వివరాలను సేకరించారు.

పట్టపగలే రూ.2 లక్షలు

చేగుంట(తూప్రాన్): పట్టపగలు నగదు చోరీ జరిగిన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాపని శ్రీనివాస్ ఆదివారం పొలం పనులకు వెళ్లగా కుటుంబీకులు గడియపెట్టి మొదటి అంతస్తులో పడుకున్నారు. సాయంత్రం శ్రీనివాస్ ఇంటికొచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానంతో ఇంట్లో వెతకగా రూ.2 చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం చేగుంట పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇటీవల అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను అదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి కిడ్నాప్ చేశాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడగా బాధితురాలి తల్లిదండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని పట్టుకొని కరీంనగర్ జైలుకు రిమాండ్‌కు తరలించారు.

పరువు పోయిందని మహిళ ఆత్మహత్య

చిన్నశంకరంపేట(మెదక్): ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండల కేంద్రంలోని బుడగజంగాల కాలనీకి చెందిన విభూతి యాదమ్మ(40) భర్త యాదగిరి ఏడేళ్ల కిందట మృతి చెందాడు. వీరికి ముగ్గురు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ఇంటి ఎదుట ఉండగా చిన్నశంకరంపేటకు చెందిన మాల్తుమ్ రాములు అనే వ్యక్తి చేయిపట్టి లాడగంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో పరువుపోయిందని మనోవేదనకు గురైన ఆమె ఇంట్లో ఉరి వేసుకుంది. మంగళవారం ఉదయం ఇరుగుపొరుగు వారు గమనించి నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాములు అసభ్యకరంగా ప్రవర్తించడంతోనే తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఉరి వేసుకొని..

కంగ్టి(నారాయణఖేడ్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంగ్టి మండలంలోని చాప్టా(కే) గ్రామ శివారులో చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్ జిల్లా మైలార్ గ్రామానికి చెందిన బావికట్టే ఉపేందర్(40) మద్యానికి బానిసై రోజూ భార్య శ్రీదేవితో గొడవ పడటంతో ఐదేళ్లుగా ఆమె స్వగ్రామమైన కంగ్టి మండలం చాప్టా(కే) గ్రామానికి వచ్చి ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తుంది. ఉపేందర్ సైతం అదే గ్రామంలో ఉంటుండగా సోమవారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి బయటకెళ్లాడు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి లక్ష్మణ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జూపల్లి హంసమ్మ(45)కు భర్త భిక్షపతితోపాటు ఇద్దరు కూతుర్లు ఉండగా కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న హంసమ్మ తీవ్ర మనోవేదనకు గురై సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం కొండపోచమ్మ కాల్వలో మహిళ మృతదేహం పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి..

కొండపాక(గజ్వేల్): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బస్వరాజుల వెంకటేశ్ (32) దసరా పండుగ రోజు రాత్రి 10 గంటలకు మద్యం సేవించి మత్తులో భార్య రేఖతో వీడియోకాల్‌లో మాట్లాడాడు. అనంతరం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన తండ్రి శివయ్య వెంటనే ఆస్పత్రికి తరలించాడు. ఈ విషయాన్ని భార్యకు చెప్పి, పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

గడ్డి మందు తాగి..

నర్సాపూర్ రూరల్: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. నర్సాపూర్ మండలం మూసాపేట గ్రామానికి చెందిన అన్నం దశరథ (33) ఈనెల 13న మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య లక్ష్మి మందలించింది. దీంతో ఇంటి నుంచి నర్సాపూర్‌కు వచ్చిన దశరథ ఎంపీడీఓ కార్యాలయం వెనుకాల ఉన్న రోడ్డుపక్కన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే ఆమె గ్రామస్తులతో వచ్చి భర్తను నర్సాపూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పండంటి బాబుకు జన్మనిచ్చి తల్లి మృతి

అనంతరం కళ్లు దానం



ప్రియాంక(ఫైల్)

గజ్వేల్‌రూరల్: పండంటి బాబుకు జన్మనిచ్చిన ఓ తల్లి(బాలింత) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అనంతరం నేత్రదానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ విషాదకర ఘటన మంగళవారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గజ్వేల్ పట్టణానికి చెందిన బచ్చు సంపత్‌తో ప్రియాంకకు గతేడాది ఆగస్టులో వివాహం జరిగింది. గర్భిణీ అయిన ప్రియాంకను డెలివరీ నిమిత్తం కుటుంబ సభ్యులు హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం రాత్రి పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఇదే సమయంలో ఫిట్స్ రావడంతో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ప్రియాంక మృతి చెందింది. మంగళవారం గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ సహకారంతో వైద్యులు ప్రియాంక కళ్లను సేకరించారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై లభ్యం

హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ



యాదయ్య (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మూడు రోజుల కిందట అదృశ్యమైన వ్యక్తి కూటిగల్ గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద శవమై లభ్యమయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. ధూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బైరగోని యాదయ్య(52)కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు యాదయ్య ఇంటి ఎదుట నుంచి వెళ్తున్న బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణకు మధ్య గొడవ జరిగింది. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బాలకృష్ణ మళ్లీ యాదయ్య ఇంటికొచ్చి మందు తాగుదామని ఇద్దరూ బైక్‌లపై కూటిగల్ గ్రామంలోని వైన్స్ వద్దకు వెళ్లారు. రాత్రి అయినా యాదయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో భార్య లక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా మంగళవారం కూటిగల్ గ్రామానికి చెందిన సాగర్ అనే యువకుడు బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. కూటిగల్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే బహిర్భూమికి వెళ్లాడు. ఆ ప్రాంతలో దుర్వాసన రావడంతో చుట్టుపక్కల చూడగా వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులకూ విషయం తెలియడంతో వెళ్లి చూసి యాదయ్యగా గుర్తించారు. మృతదేహంపై పలు చోట్ల గాయాలు ఉన్నాయి. మద్యం బాటిళ్లు సైతం లభించాయి. యాదయ్యను బాలకృష్ణ తీసుకెళ్లి హతమార్చినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ షేక్ మహబుబ్ విచారణ చేపట్టారు.

కోలుకున్న సంజీవన్‌రావుపేట్

- ఆస్పత్రుల నుంచి రోగుల డిశ్చార్జి
- కొనసాగుతున్న వైద్య శిబిరం

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేట్‌లో మంగళవారం పరిస్థితి అదుపులోకి వచ్చింది. నీటి కలుషితం కారణంగా ఇద్దరు మృతి చెందడం.. మరో 50 మందికి పైగా అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో సోమవారం ఇద్దరు, మంగళవారం ఐదుగురు డిశ్చార్జి అయ్యారు. మరో 13మంది చికిత్స పొందుతూ కోలుకున్నారని, వారందరి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురురిలో ముగ్గురు, అక్కడి ప్రైవేట్ ఆస్పత్రిలోని ముగ్గురిలో ఇద్దరు డిశ్చార్జి అయ్యారు. గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతుండగా ఇద్దరు వైద్యులు, ముగ్గురు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశాకార్యకర్తలు సేవలు అందిస్తున్నారు.

గ్రామసభ..

గ్రామ పరిస్థితిపై తహసీల్దార్ భాస్కర్, డీఎల్‌పీవో సంజీవరావు, గ్రామ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, వైద్యాధికారి సుశీల్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో పందులు, కుక్కల బెడద విపరీతంగా ఉన్న విషయం స్థానికులు వారి దృష్టికి తెచ్చారు. ఐదు రోజుల్లోపు పందులను తరలిస్తామని వాటి యజమానులు అధికారులు తెలిపారు. అలాగే.. కుక్కల బెడద నివారిస్తామని చెప్పారు. పలు కాలనీలకు రోడ్లు, మురుగు కాల్వలు, ఒక విద్యుత్ స్తంభం తదితర సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాచి వడపోసిన నీటిని తాగాలని, ఆరోగ్య జాగ్రత్తల గురించి వైద్యాధికారి డాక్టర్ సుశీల్ వివరించారు.



నారాయణఖేడ్: ప్రాంతీయ ఆస్పత్రిలో కోలుకున్న బాధితులు

రాజకీయం తగదు: ఎమ్మెల్యే

గ్రామంలో నెలకొన్న సమస్యలపై తక్షణం స్పందించి తాను అధికారులను అప్రమత్తం చేసి క్యాంపు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఈ ఘటనపై కొందరు రాజకీయం చేసి గ్రామంలో సమస్యలు సృష్టించేందుకు యత్నించారని పేర్కొన్నారు. మిషన్ భగీరథలో నాణ్యతలేని పైపులు వేసి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. 50 హ్యాబిటేషన్లు ఉంటే ఏఈలను నియమించకుండా ఒక్క ఏఈతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెట్టుకువచ్చిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిషన్ భగీరథలో ఏఈలను నియమించి సక్రమ నీటిసరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

నారాయణఖేడ్: ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణతో కలసి నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటను సందర్శించారు. కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురైన బాధిత కుటుంబీకులను పరామర్శించారు. మృతి చెందిన సాయమ్మ, మహేష్ కుటుంబాలకు రూ.50వేల చొప్పున నగదు సహాయం అందజేశారు. అనంతరం గ్రామంలోని బావిని, ఖేడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు మారుతిరెడ్డి, బస్వరాజ్, అరుణ్ రాజ్, సంజీవన్‌రావుపేట మాజీ సర్పంచి విఠల్ పాల్గొన్నారు.